

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించండి

## కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఎంపీ వేమిరెడ్డి వినతి



**నెల్లూరు, మార్చి 18, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయం లో కలిసి ఆయనను కలిసి ఆంధ్రప్రదేశ్ చౌక ధరల దుకాణ దారుల సంక్షేమ సమాఖ్య, ఆల్ ఇండియా ఫేర్ ప్రైజ్ షాప్ ఫెడరేషన్ తరఫున వినతిపత్రం అందజేశారు. ఇటీవల రేషన్ డీలర్లు వివిధ సమస్యలపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన ఢిల్లీలో కేంద్రమంత్రితో భేటీ అయి సమస్యలను విన్నవించారు. చౌక ధరల దుకాణాల డీలర్లకు ప్రస్తుతం సగటు కమీషన్ నెలకు రూ.6000 నుంచి రూ.8000/ మధ్య ఉంటోందని, ఇది జీవనోపాధికి సరిపోవడం లేదన్నారు. రేషన్ షాపు అద్దె, క్లర్క్ జీతం, విద్యుత్ బిల్లు, దివ్యాంగులకు వృద్ధులకు ఇంటింటికీ డెలివరీ చేయడం వంటి నిర్వహణ ఖర్చులు భారంగా మారాయన్నారు. చౌక ధరల దుకాణాల డీలర్లకు ప్రభుత్వం నెలకు రూ. 35,000/ ఆదాయాన్ని అందించాలని విన్నవించారు. అలాగే దుకాణాల డీలర్లకు కుటుంబ ఆరోగ్య కార్డులను అందించేలా చూడాలని కోరారు. డీలర్ మరణించిన పక్షంలో, వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావలసిన అన్ని బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి.. రేషన్ డీలర్ల సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చౌక ధరల దుకాణ దారుల సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు గిరిజారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

**ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



**నెల్లూరు, మార్చి 18, ప్రభాతవార్త :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా నెల్లూరు జిల్లా ప్రజానీకానికి, కూటమి నాయకులకు, కార్యకర్తలకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఈ పర్వదినం.. ప్రతి ఇంట సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి మన జీవన విధానాన్ని సజీవంగా ఉంచుతాయన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలకు ఆ భగవంతుడు అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని, దేవుడి దీవెనలతో అన్ని విషయాల్లో విజయం సిద్ధించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ డబ్ల్యూ.హెచ్.ఓ సారథ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని, ప్రజల జీవితాలు కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు.

# ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నారాయణ



**నెల్లూరు, మార్చి 18, ప్రభాతవార్త-వైద్యం** తెలుగులోగిళ్లలో కొత్త వెలుగులు నింపే శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురష్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచుల లాగా జీవితంలోని కష్టసుఖాలను ధైర్యంగా స్వీకరిస్తూ రాష్ట్ర ప్రగతిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజలందరికి గొప్ప విజయాలను అందించాలని మంత్రి అభిలాషించారు.

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయండి

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**

**- సోమశిల, కండలేరు ఇంజనీరింగ్, రెవిన్యూ అధికారులతో సమీక్ష**



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 18, ప్రభాతవార్త** కండలేరు, సోమశిల జలాశయాలకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి భూములను సంబంధిత శాఖకు అందించేలా చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ సంబధిత అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ వారి చాంబర్ నందు సోమశిల, కండలేరు ఇంజనీరింగ్, రెవిన్యూ అధికారులతో సమీక్ష సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనం సంజీవయ్య బ్రాంచ్ కెనాల్ మరియ కే.జి.యం బ్రాంచ్ కెనాల్ కు సంబంధించి భూసేకరణ పూర్తి అయిన పిదప అవార్డ్ జారీ చేయుటతో పాటు యజమానలుకు త్వరితగతిన పరిహారం చెల్లించాలన్నారు. అవసరమైన చోట అవార్డు జారీతో పాటు నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. ఇంకా పరిహారం చెల్లించకపోవుటకు గల కారణాలు అడిగితెలుసుకొన్నారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. భూ సేకరణకు సంబందిచి సర్వే నంబర్లుతో లబ్దిదారుల వివరాలను అందచేయాలన్నారు. సోమశిల జలాశయ యస్.ఇ వెంకట రామణా రెడ్డి, తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ మురళి, స్పెషల్ కలెక్టర్ మహేందర్ రెడ్డి, వెంకటరెడ్డి, సంబంధిత మండల రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు

**- కలెక్టర్ హిమాన్ష్ శుక్ల**



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 18, ప్రభాతవార్త** జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతంగా అమలుచేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో జిల్లాకు సంబంధించి చర్చించిన పలు అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం, గృహనిర్మాణం, సంక్షేమం, జలవనరులు, వైద్యారోగ్య రంగాలకు సంబంధించి ప్రధానంగా కలెక్టర్ల కాన్ఫరెన్సులో చర్చించినట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలు సంతృప్తి చెందేలా అందించడమే ప్రధాన లక్ష్యం కావాలన్నారు. జిల్లా స్థాయి అధికారులందరూ తమ శాఖల పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలను పర్యవేక్షించేలా ప్రతినెలా కనీసం 8 క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలన్నారు. వన్ విలేజ్ వన్ మంత్ ఫోర్ విజిట్స్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే కీ ఫర్ఫామెన్స్ ఇండికేటర్లలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉండేలా ప్రాధాన్యతశాఖల అధికారులందరూ తమ శాఖల పనితీరును మరింత మెరుగు పరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా, డిఆర్‌వో మహేశ్వర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డ్వామా పిడి గంగాభవాని, జల వనరుల శాఖ ఎసఈ దేశ్‌నాయక్, ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, డిఇవో బాలాజీరావు, ఐసిడిఎస్ పిడి హేనాసుజన్, డిసిహెచఎస్ పరిమళ, ఆర్డీవోలు అనూష, పావని తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**- జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల**



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 18, ప్రభాతవార్త** ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శుభాకాంక్షలు తెలిపారు. పరాభవ నామ సంవత్సర ఉగాది మీ ప్రతి ఇంటికి సంతోషం, శాంతి, సంపదలను తీసుకురావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో నిండిపోవాలని, రైతులు పుష్కల పంటలతో ఆనందంగా ఉండాలని, యువత తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఉగాది మన సంప్రదాయాల సుగంధాన్ని, ఆశల వెలుగును తీసుకొచ్చే పర్వదినం. ఈ శుభసందర్భంగా మనం అందరం ఐక్యంగా ముందుకు సాగుతూ జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని, ప్రజలందరికీ మరోసారి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## సోమశిల నీటిమట్టం



అనంతసాగరం, మార్చి 18, ప్రభాతవార్త : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 664 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయం లో 62.606 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎస్ఎఫ్‌సికి 700, పెన్నా డెల్టా 0 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 98.408 మీటర్ల మేర నీటిమట్టం నమోదైనది జలాశయం అధికారులు తెలిపారు.

# దివ్యాంగశక్తి పథకాన్ని ప్రారంబించిన జిల్లాకలెక్టర్ హిమాన్ను శుక్లా





**నెల్లూరు, మార్చి 18, ప్రభాతవార్త-విద్య :** రాష్ట్రంలోని దివ్యాంగుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ఎంపిక చేసిన ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే దివ్యాంగశక్తి పదకాన్ని నేడు ప్రారంభించటం జరిగిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్థానిక ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ఏర్పాటుచేసిన దివ్యాంగశక్తి పథక ప్రారంబోత్సవ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ దేవరకొండ సుజాత, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిలతో కలిసి పాల్గొని ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి వారితో మాట్లాడి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు.

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతు**

ఈ పథకాన్ని ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. గతంలో కేవలం అందత్వం, మాసనిక, మూగ, చెవిటి వారికి మాత్రమే ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే వీలు ఉండేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 21 రకాలకు చెందిన దివ్యాంగులకు పల్లె వెలుగు, అల్ట్రాడీలక్స్, మెట్రో ఎక్స్ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సహాయకునికి 50శాతం రాయితీ అందిస్తుందన్నారు . అలాగే ఏసీ ప్రీమియం బస్సుల్లో 50శాతం రాయితీతో దివ్యాంగులు, సహాయకులు ప్రయాణించవచ్చు న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 74శాతం బస్సుల్లో ఈ ఉచిత ప్రమాణం సాగించవచ్చని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.6వేల నుండి 15 వేల వరకు దివ్యాంగులకు పెన్షన్ ఇస్తుందని గుర్తుచేశారు. ఆర్టీసీ సంస్థ ఉద్యోగులు, కండెక్టర్లు, డ్రైవర్లు దివ్యాంగులను గుర్తించి మర్యాదగా నడుచుకోవాలనిసూచించారు.

**మేయర్ సుజాత మాట్లాడుతు**

ఈ పథకాన్ని దివ్యాంగులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి మాట్లాడుతు**

దివ్యాంగులక ఈ పథకం ఓ వరం లాంటిదన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం తోడుగా ఉంటుందని మరో మారు రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం .షేక్.షమీమ్, సిటిఎం రమేష్, డిపో మేనేజర్స్ వెంకటేశ్వర్లు, ఎస్.కే.కరిమున్నీసా, సిఐలు శ్రీధర్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ గిరిజన సంఘంలో కార్డెన్ సెర్చ్



**నెల్లూరు క్రైమ్, మార్చి 18, ప్రభాతవార్త:** ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా నెల్లూరు సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టిన ఆపరేషన్ వజ్రప్రహార్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్.పి. అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు బుధవారం సంతపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌ను టౌన్ ఏఎస్పి దీక్ష ఆధ్వర్యంలో సంతపేట సీఐ వైవి సోమయ్య నేతృత్వంలో నిర్వహించగా, మొత్తం 50 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా 150 ఇళ్లను తనిఖీ చేయగా, వాహనాల తనిఖీలలో పత్రాలు లేని 14 బైక్‌లు, ఒక ఆటో గుర్తించబడినవి. పాత కేసులలో ఉన్న ఇద్దరు రౌడీ షీటర్ లను కనుగొని వారిని పిలిపించి సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించారు. పోలీసులు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, రోడ్ సేఫ్టీ, ప్రాపర్టీ నేరాలు, సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు. ప్రజలు గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఏపి ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా డయల్ 112 కు సమాచారం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఆపరేషన్ వజ్రప్రహార్ కింద ఇలాంటి చర్యలు కొనసాగుతాయని ఎస్.పి. తెలిపారు.

# దివ్యాంగులకు వరం దివ్యాంగ శక్తి పథకం



**రాపూరు, మార్చి 18, ప్రభాతవార్త** దివ్యాంగులకు వరంగా రాష్ట ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు రాపూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డి తెలిపారు. బుదవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు ఆయన రాపూరు ఆర్టీసి బస్టాండ్‌లో దివ్యాంగ శక్తి పథకం ప్రారంబోత్సవంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్టంలోని దివ్యాంగులకు పూర్తి ఉచితంగా ఆర్టీసి బస్సులలో ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. దివ్యాంగులతో పాటు వారికి సహాయకులగా వెల్లే ఒకరికి కూడా ప్రయాణంలో 50 శాతం రాయితీ ఈ పథకం ద్వారా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి డిపో మేనేజర్ అనీల్ కుమార్, రాపూరు సొసైటీ అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కోండ్లపూడి రాఘవ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ ఉపాధ్యక్షుడు షేక్ ముక్తియార్, రాష్ట ఎస్‌సీ సెల్ నాయకుడు పచ్చిగళ్ళ రత్నం, మండల కో ఆప్షన్ సయ్యద్ సయ్యద్, ఏయంసీ డైరెక్టర్‌లు అమ్ములు, జనసేన నాయకురాలు కోండాపురం కస్తూరి, సికిందర్, పలువరు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగులు, ప్రయాణికులు,ఆర్టీసి సిబ్బంది వున్నారు.

# సంతోషంగా రంజాన్ జరుపుకునేందుకు రంజాన్ తోఫా



**రాపూరు, మార్చి 18, ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని నిరుపేదలైన ముస్లీంలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకునేందుకే వారికి రంజాన్ తోఫాను అందిస్తున్నట్లు రాపూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డి తెలిపారు. బుదవారం రాపూరులోని షాధీ మంజిల్‌లో యం.సీ పౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేదలైన 200 మంది ముస్లీంలకు రంజాన్ తోఫాను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంసీ పౌండేషన్ ద్వారా ఈ రంజాన్ తోఫా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మైనారిటీ నాయకులు పఠాన్ ఖాన్ భాషా, సికిందర్, అహమద్, ఏయంసీ డైరెక్టర్‌లు అమ్ములు, జనసేన నాయకురాలు కోండాపురం కస్తూరి, మాజీ యంపీపీ ఇసళ్ళ సూర్యప్రకాష్ తదితరులున్నారు.

# అక్షర ఆంధ్ర ను విజయవంతం చేసినందుకు అభినందనలు

**అదనపు కమిషనర్ హిమబిందు**



**నెల్లూరు కార్పోరేషన్, మార్చి 18 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన నోడల్ అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శుల సేవలు అభినందనీయమని స్వర్ణగ్రామ వార్డు సచివాలయ అదనపు కమిషనర్ హిమబిందు ప్రశంసించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం అదనపు కమిషనర్ హిమబిందు సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఏపి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణలో ఉల్లాస్ అక్షర ఆంధ్రా(న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం) కార్యక్రమంలో భాగంగా ప్రజల అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ పర్ ఆల్ ఇన్‌సొసైటి అమలు లో భాగంగా అక్షర ఆంధ్ర అక్షరాస్యత కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహించి 98శాతం ప్రజలు పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనంతరం అక్షర ఆంధ్ర విశేషంగా కృషి చేసిన నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులను ఘనంగా సత్కరించారు.



# కోవూరు నియోజకవర్గ ప్రజానీకానికి ఉగాది శుభాకాంక్షలు

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**కోవూరు, మార్చి 18, ప్రభాతవార్త :** తెలుగు వారి తొలి పండుగ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కోవూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శ్రీ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఆమె ప్రత్యేకంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలని మనకు బోధిస్తుందని ఈ నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు. చంద్రబాబు నాయుడు అనుభవం, పవన్ కళ్యాణ్ పట్టుదల, లోకేష్ దూరదృష్టితో కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కోవూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన ధ్యేయమని రైతులు, కార్మికులు, మహిళలు యువత సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. పరాభవ నామ సంవత్సరంలో ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**- ఎస్పీ అజిత వేజెండ్ల**



**నెల్లూరు క్రైమ్, మార్చి 18, ప్రభాతవార్త:** జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాల నడుమ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా తెలుగు సంవత్సరాది ఉగాదిని జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా వాసులందరూ ఈ పరాభవ నామ సంవత్సరంలో సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఉగాది మన ఆశల సౌరభాలకు పునాది అని, అందరూ ఈ ఏడాది ప్రారంభాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆమె కోరారు.

# దివ్యాంగులకు అండా కూటమి ప్రభుత్వం

**దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**





**కావలి, మార్చి 18 ప్రభాతవార్త :** దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని వారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసి బస్టాండు నందు ఆర్టీసి బస్సుల్లో దివ్యాంగులకు ఉచతి ప్రయాణ సౌకర్యం కల్పించే దివ్యాంగ శక్తి పథకాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జెండా ఊపి బస్సును ప్రారంభించి, స్వయంగా దివ్యాంగులతో కలసి బస్సులో కొద్దిదూరం ప్రయాణించి వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఈసందర్భంగబా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకొని సిఎం నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని అన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలలో మొదటిదిగా ఈ ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణ పథకాన్ని అమలోలకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సుమారు 11లక్షల మంది దివ్యాంగులు ఈ పథకం దావరా లబ్ది పొందుతున్నారని తెలిపారు. మహిళా శక్తి పథకానికి వర్తించే నిబంధనలతోనే దివ్యాంగ సోదరులు, సోదరీమణులు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. దివ్యాంగుల జీవితాల్లో ఆత్మస్థైర్యం కూటమి ప్రభుత్వం నింపుతున్నాయని తెలిపారు. సిఎం తీసుకొన్న ఈ నిర్ణయాన్ని ప్రజలు అభినందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్టీసి డిఎం డి.ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజర్ కల్పన, టిడిపి కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, కండ్లగుంట మధుబాబునాయుడు, అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, దేవరకొండ శ్రీను, మండల వెంకట్రావు, ఆర్టీసి సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసిన పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి



**కోట, మార్చి 18 ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ మాజీ సీడ్ ఛైర్‌పర్సన్ పేర్నేటి హిమసుశ్మిత, పేర్నాటి నేచురల్స్ డైరెక్టర్, పేర్నేటి బిందు ఐశ్వర్యలు కుటుంబ సమేతంగా కలిశారు. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డికి శాలువకప్పి పుష్ప గుచ్చంతో ఘనంగా సన్మానించారు. .ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లా తాజా రాజకీయాలపై శ్యాంప్రసాద్‌రెడ్డితో చర్చించినట్లు సమాచారం.

## ప్రజల ముంగిటే ప్రజా సమస్యలు పరిష్కారం



**సైదాపురం, మార్చి 18, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలు ప్రజల ముంగిటే పరిష్కారం చేయడం జరుగుతుందని తహసీల్దార్ ఎం.సుభద్ర తెలిపారు. మండల పరిధిలోని గులించర్ల గ్రామంలో వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్‌లో భాగంగా మూడో విడతగా ప్రజా సమస్యలపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల వద్ద నుండి సుమారు 10 అర్జీలను ఆమె స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా ప్రజల ముంగిటే ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రదీప్ కుమార్, మండల సర్వేయర్ మాబుబ్ భాషా, టీడీపీ నాయకులు నలమారు వెంకటేశ్వర్లు రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు

### – అన్ని ముందస్తు చర్యలు



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 18, ప్రభాతవార్త :** వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వడదెబ్బ నివారణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు వడదెబ్బ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా బస్‌స్టేషన్లు, జనసంచారం ఉన్న కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కేవలం చలివేంద్రాలు ఏర్పాటు చేయడమే కాకుండా వాటిలో ప్రతిరోజూ నీరు ఉండేలా పర్యవేక్షించాలన్నారు. ఉపాధిహామీ కార్మికులకు నీడవసతి, మంచినీరు ఏర్పాటుచేయాలన్నారు. ఉదయం 10 గంటల వరకే పనిచేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులకు ఇబ్బందులు లేకుండా ఎక్కువ నీరు తాగేలా చూడాలన్నారు. పాఠశాలల్లో వాటర్‌బెల్ కార్యక్రమం నిర్వహించాలని డిఇవోకు సూచించారు. మండల కేంద్రాల్లోని పంచాయతీ, తహశీల్దారు, ఎంపిడివో కార్యాలయాల్లో ప్రజలకు నీటి సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో కరెంటు కోతలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మున్సిపాలిటీ కేంద్రాల్లో స్వచ్ఛంద సేవాసంస్థల సహకారంతో చలివేంద్రాలు, మజ్జిగ, చల్లని పానీయాలు ప్రజలకు అందించేలా చూడాలన్నారు. అనంతరం వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాషా, డిఆర్‌వో మహేశ్వర్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ అధికారి భాస్కర్‌రావు, ఆర్డీవోలు అనూష, పావని, డిసిహెచ్ఎస్ పరిమళ, డ్వామా పిడి గంగాభవాని, వ్యవసాయాధికారి సత్యవాణి, అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఘనంగా పరిగ్రాహ్-2కె26




**కోట, మార్చి 18 ప్రభాతవార్త :** కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పరిగ్రాహ్-2కె26 (జాతీయ స్థాయి శాస్త్ర సాంకేతిక సదస్సు)ను నిర్వహించారు. ముందుగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మౌలిక వసతుల రూపకల్పనలో సివిల్ ఇంజినీర్ల ఆవశ్యకతను తెలియజేశారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధనల ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుకుంటూ వివిధ రకాల నిర్మాణాలు చేయాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సివిల్ ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మకతను వెలికితీయడానికి పరిగ్రాహ్-2కె26 సదస్సు సరైన వేదికగా ఉపయోగపడుతుందన్నారు. డీన్ డాక్టర్ జి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ వికసిత్ భారత్ సాధనలో సివిల్ ఇంజినీర్లు ఆధునిక మౌలిక సదుపాయాల నిర్మాణం ద్వారా దేశాభివృద్ధికి కీలక శక్తిగా నిలిచి సుస్థిరతతో కూడిన భవిష్యత్‌ను నిర్మిస్తారని తెలిపారు. అనంతరం సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పివి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సివిల్ ఇంజినీర్లు సమాజ అభివృద్ధికి పునాది వంటి వారని, వారు నిర్మించే రహదారులు, వంతెనలు, భవనాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించిన పేపర్ ప్రజంటేషన్ పోటీలకు వివిధ కళాశాలల నుంచి 40 సాంకేతిక పత్రాలు సమర్పించగా, అందులో అత్యుత్తమమైన 10 పత్రాలు ఎంపిక చేసి వారికి పోటీ నిర్వహించారు. అంతేకాకుండా పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, బ్లూప్రింట్ బ్యాటిల్, క్వెజ్ ఎక్స్‌ప్లోర్ తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ చేతులు మీదుగా నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీవీ సుబ్బారెడ్డి, కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, కోకన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం



**కోట, మార్చి 18 ప్రభాతవార్త :** దివ్యాంగులకు స్వేచ్ఛగా ప్రయాణం, సమాజంలో భాగస్వామ్యం, జీవన ప్రమాణాలు మెరుగుదల కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కోట మండల తహశీల్దార్ కె.జయజయరావు అన్నారు. బుధవారం కోట ఆర్టీసీ బస్టాండులో దివ్యాంగ శక్తి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఈ పథకం ప్రారంభమైందని చెప్పారు. దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా నెలకు రూ.6 వేలు పెన్షన్, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు పెన్షన్ అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఆర్టీసీ ద్వారా పల్లె వెలుగు, ఆల్ట్రా, ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన వారు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. బస్సు ప్రయాణం సమయంలో దివ్యాంగులకు సౌకర్యం కల్పించేందుకు డ్రైవర్లు, కండక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రత్యేక సీట్లు కేటాయింపు, ఎక్కడం, దిగడంలో సహాయం వంటి అంశాల్లో సిబ్బంది సున్నితంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పెంచలయ్య, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## జై భీమ్‌రావు భారత్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

## జిల్లా అధ్యక్షులు డాక్టర్ మైనంపాటి ఏసురత్నం



**కావలి, మార్చి 18 ప్రభాతవార్త :** జై భీమ్‌రావు భారత్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటానని నూతన జిల్లా అధ్యక్షులు డాక్టర్ మైనంపాటి ఏసురత్నం తెలిపారు. జిల్లా నూతన అధ్యక్షునిగా ఎంపికైన సందర్భంగా బుధవారం నెల్లూరు పట్టణంలోని విఆర్‌సి సెంటర్ వరద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనత నిర్మించబడిన పార్టీ జై భీమ్‌రావు భారత్ పార్టీ అని తెలిపారు. పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్‌కుమార్ నాయకత్వంలో నెల్లూరుజిల్లా అధ్యక్షులుగా నాకు బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని నియోజకవర్గాలకు బలోపేతం చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనను వారి అధికార దుర్వినియోగాన్ని ఎండగట్టి ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీసి రాజ్యాంగబద్ధమైన పాలనకు తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరు పార్లమెంటు ఇన్‌చార్జ్ తాళ్లూరి వెంకటయ్య, కోవూరు ఇన్‌చార్జ్ శివకుమార్, సిటీ ఇన్‌చార్జ్ రఘునాథ్, పార్టీ నాయకులు హజరత్తయ్య, మేరీ గ్రేస్ చంద్ర కుమార్, మోజస్ విజయక్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంజాన్ సందర్బంగా రంజాన్ తోఫా, చీరలు పంపిణీ



**కావలి, మార్చి 18 ప్రభాతవార్త :** విశ్రాంత ఉప తహశీల్దార్ మొఘల్ శిరాజ్ బేగ్, మొఘల్ సల్మాబేగం దంపతుల ఆధ్వర్యంలో వారి కుమారుడు సమీర్ బేక్ కోడలు ఫర్వానాజ్ దాతృత్వంతో రంజాన్ సందర్బంగా బుధవారం పేద ముస్లిం మహిళలకు దాదాపు 50మందికి రంజాన్ తోఫా కింద నిత్యవసర సరుకులు, చీరలు, పంపిణీ చేశారు. స్వచ్ఛందసంస్థల గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.బాషా మాట్లాడుతూ మొఘల్ శిరాజ్ బేగ్ కుటుంబసభ్యులు మంచి మనస్సుతో పేద ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగ సంతోషంగా జరుపుకోవాలని ఈ తోఫాను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్నమ్మ పౌండషన్ అధ్యక్షులు ప్రసాద్‌రావు, మీ కోసం సేవాసంస్థ అధ్యక్షులు రాయపాటి దిలీఫ్‌కుమార్, విశ్రాంత ఉపాధ్యయులు అశోక్‌కుమార్, అజామ్ తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడులు



**సైదాపురం, మార్చి 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తూర్పుపూండ్ల గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న పొలాల్లో కోడి పందాలు నిర్వహిస్తున్న స్థావరంపై సైదాపురం ఎస్సై కాంతికుమార్ తమ సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తూర్పు పూండ్ల గ్రామ సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో వెంటనే సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రెండు పందెం కోళ్ళను, రూ.2920 నగదును స్వాధీనం చేసుకున్నామని కాంతి కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**కోవూరు, మార్చి 18 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్రం ఉద్యోగులతో కలిసి ఎంపీటీసీ సభ్యులు కొల్లారెడ్డి సునీల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డిలు రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేవలం సంక్షేమాన్ని మాత్రమే కాదని, సంపద సృష్టించే వ్యవస్థను కూడా పూర్తిస్థాయిలో బలోపేతం చేసుందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనం, ఎరువు, సాంకేతిక యంత్రాలు అందిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తోలిన 48 గంటల్లోనే రైతుల ఖాతాలో నిధులు జమ చేసిన ప్రభుత్వం ఈ కూటమి ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేజర్ల మోహన్, ఇనమడుగు గ్రామ అధ్యక్షుడు తోట రామచంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

## రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, మార్చి 18 ప్రభాతవార్త :** కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఉన్న 16938 మంది రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ , పీఎం కిసాన్ పథకం కింద 20 వేలు చొప్పున నిధులు విడుదల చేయడం జరిగిందని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరులోని డాకా ప్రభాకర్‌రెడ్డి పొలాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి రైతు మొబైల్‌లో ఏపీఎయిమ్స్ అనే యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించుకుని ఆ యాప్ ద్వారా రైతులకు వ్యవసాయం గురించి అన్ని వివరాలు పొందుపరిచి ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతు తమ తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో వరి కోతలు జరుగుతున్నాయన్నారు. ఆయా మండలాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాతావరణ శాఖ రానున్న 2,3 రోజుల్లో వర్షం పడే అవకాశం ఉన్నట్లు ముందస్తుగా తెలియజేశారని, రైతులు ఈ విషయాన్ని గమనించి వరికోతలు చేపట్టాలన్నారు. కోవూరులోని డాకా ప్రభాకర్‌రెడ్డి పొలంలో సాగు చేసిన కొత్త రకం ఎన్ఎల్ఆర్ 3648 రాగోలు 7045 రకాలను శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలక్ష్మితో కలిసి నిశిత పరిశీలన చేపట్టారు. ఇందులో రాగోలు రకం 130 నుంచి 140 రోజులు గింజ కొంచెం లావుగా ఉంటుందన్నారు. ఎన్ఎల్ఆర్ 3648 రకం సన్నగింజతో పాటు పురుగులు, తెగుళ్లను తట్టుకుని మంచి దిగుబడి నమోదువుతుందన్నారు. ఈ రకం ఎడగారు సీజన్‌కు ఎంతో అనుకూలమని శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. దిగుబడి కూడా 3 నుంచి మూడున్నర టన్ను కూడా వస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

## ఘనంగా సంకటహర చతుర్థి వేడుకలు



**కోవూరు, మార్చి 18 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వెలసి ఉన్న విఘ్నేశ్వరునికి సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేకం, పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



**కోవూరు, మార్చి 18 ప్రభాతవార్త :** కోవూరులోని టీఎన్‌సీ కళాశాల ఇనమడుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ రెండవ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. కోవూరు ఎస్సై ముత్యాలరావు పర్యవేక్షణలో ఎస్సై ఖదిర్‌బాషా, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చేపట్టారు. అదేవిధంగా పరీక్ష జరిగే ప్రాంతాల్లో జెరాక్స్ షాపును కూడా పోలీసులు మూసివేసేలా తగు చర్యలు చేపట్టారు.

## ఘనంగా అన్నదానం



**కోవూరు, మార్చి 18 ప్రభాతవార్త :** స్థానిక దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు అత్యంత వైభవంగా చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యులు మాట్లాడుతూ గత 6 సంవత్సరాలుగా ఎటువంటి ఆటంకాలు లేకుండా నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఉభయదాతల సహకారంతో నిర్వహిస్తూనే ఉన్నామన్నారు.

## టిడిపి నాయకుడు రఫీ పై అట్రాసిటీ కేసు నమోదు

**విడవలూరు, మార్చి18 ప్రభాతవార్త:** ముదివర్తి గ్రామానికి చెందిన పట్టపు రోహిత్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ యువతని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. యువతి, తల్లిదండ్రులు ఏడాది క్రితం రాజకీయ ఒత్తిడితో రోహిత్ పై పోక్స్ కేసు పెట్టించారు. మూడు నెలలు జైలు శిక్ష అనుభవించి, చట్ట ప్రకారం కోర్టు వాయిదాలకు తిరుగుతున్న క్రమంలో ఈ కేసు హియరింగ్ కు వచ్చిందని తెలుసుకున్న రోహిత్ అదే గ్రామానికి చెందిన టిడిపి నేత రఫీ ను న్యాయం కావాలని కోరాడు. దీంతో టిడిపి నేత రఫీ నీవు దళిత కులానికి చెందిన వాడివి, నీకు మా కులం అమ్మాయి కావాలనా.. అంటూ దురుసుగా ప్రవర్తిస్తూ కులం పేరుతో దూషించాడు. కాక, రోహిత్ నీవు14 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తావో, గడ్డి మందు తాగి చచ్చిపోతావో నీ ఇష్టం“ టిడిపి నాయకుడు రఫీ మాటల వేధింపులకు రోహిత్, గడ్డి మందు తాగుతూ మొబైల్ ఫోన్లో సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. నా చావుకు టిడిపి నేత రఫీ కారణమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు రోహిత్ ను సోమవారం ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. రోహిత్ ఆత్మహత్యాయత్నం ఘటనను పక్కదారి పట్టించేందుకు అధికార పార్టీ నాయకులు సకల ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా దళిత సంఘాల నాయకులు ప్రైవేటు వైద్యశాలకు చేరుకుని రంగంలోకి దిగడంతో వైద్యశాల ప్రాంగణమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రోహిత్ ను చిన్న చూపు చూస్తూ కులదూషణ మాట్లాడడమే గాక, రోహిత్ను ప్రాణాలు తీసుకోమని సలహాలు చెప్పడం పై దళిత సంఘాలు నాయకులు మండిపడి, టిడిపి నాయకుడు రఫీ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిట్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రోహిత్ ను మెరుగైన చికిత్స కోసం తిరుపతిలో ఉన్న కిమ్స్ వైద్యశాలకు మంగళవారం రాత్రి తరలించారు. దళిత సంఘాలు బుధవారం విడవలూరు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాలు నిర్వహిస్తారని గమనించిన పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మంగళవారం రాత్రి 11 గంటలకు ముదివర్తి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, కోఆప్షన్ నెంబర్ ఎస్ కే.రఫీ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి. నరేష్ తెలిపారు.

## విజయవాడలో జరుగు మహాసభను జయప్రదం చేయాలి



**కావలి, మార్చి 18 ప్రభాతవార్త :** భారతీయ జనతాపార్టీ ఓబీసి మోర్చా జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటేశ్వర్లు అధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి కవయిత్రి మొల్ల సాంస్కృతిక వైభవం ఆహ్వాన పత్రికను బుధ వారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఈనెల 22న ఆదివారం విజయవాడలో మహాసభ కార్యక్రమం జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఓబిసి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ మాల్యాద్రి జిల్లా టెలికం సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, మండల అధ్యక్షులు జరుగుమల్లి జయకుమార్, ఓబిసి జిల్లా నాయకులు కె.శ్రీనివాసులు, ఆవుల పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి అదృశ్యం



**సైదాపురం, మార్చి 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చాగణం గ్రామానికి చెందిన బంకాపురి మణికంఠ అనే విద్యార్థి మంగళవారం రాత్రి అదృశ్యమయ్యాడు. దీంతో మణికంఠ తండ్రి సుబ్బయ్య పోలీసు స్టేషన్‌లో తన కుమారుడు అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గూడూరులోని ఎస్వీఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సం చదువుతున్న మణికంఠ గత రెండు రోజులుగా ముబావంగా ఉంటున్నాడని, మంగళవారం రాత్రి సుమారు 7.30గంటల ప్రాంతంలో ఇంట్లో నుండి వెళ్ళిపోయి కనిపించకపోవడంతో బంధువులు, చుట్టు పక్కల విచారించగా మర్లపూడి గ్రామ సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువ పక్కన మణికంఠకు సంబంధించిన బైక్ కనుగొన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కాంతికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భూ ఆధార్ నంబర్‌తో రైతులకు విస్తృత ప్రయోజనాలు

### – ఏపీఐఎంఎస్ యాప్‌ను ప్రతి రైతు డౌన్లోడ్ చేసుకోండి – వ్యవసాయ కమీషనర్ కే.శ్రీనివాసులు



**నెల్లూరు అగ్రికల్చర్, మార్చి 18, ప్రభాతవార్త :** రైతు సంక్షేమం, వారి ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కమీషనర్ కే.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్లలో ఆయన రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సహాయకులు రైతు ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రతి రైతును ఏపీఎఫ్ఆర్(ఆంధ్రప్రదేశ్ రైతు భూమి పట్టి)లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ నమోదు ద్వారా ప్రతి రైతుకు 11 అంకెల భూ ఆధార్ లభిస్తుందని, ప్రభుత్వం అందించే రాయితీలు, ఇతర పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఈ నంబరు కీలకమని వివరించారు. రైతులు తమ మొబైల్ ఫోన్లో తప్పనిసరిగా ఏపీఐఎంఎస్ (ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ సిస్టం) యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ యాప్ ద్వారా ప్రభుత్వ పథకాలు, చీడ పీడల నివారణ చర్యలు, పంటల సంరక్షణ వివరాలు తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సెల్‌ఫోన్‌లో యాప్‌ను పరిశీలించి వాఇకి దాని ఉయోగం గురించి తెలియజేశారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కింద రైతుల ఖాతాలలో జమయిన మొత్తాలను కమీషనర్ పరిశీలించారు. ఈ పథకాలు రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో ఉపయోగపడతాయన్నారు. ఏపీసీఎన్ఎఫ్(ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్) వారు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ చక్రం, వారు తయారు చేసిన విత్తన గుళికలను కమీషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులతో ప్రకృతి వ్యవసాయం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు పీఎండీ(ప్రీ మన్సూన్ డ్రై షోయింగ్ కిట్స్) సంచులను పంపిణీ చేశారు. వీటి ద్వారా రైతులు పచ్చి రొట్ట ఎరువులను పెంచి, కలియ దున్నడం వలన భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందని తెలియజేశారు. గ్రామంలో సాగు చేస్తున్న వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన శాఖ అందించే సాంకేతిక సలహాలు రాయితీల గురించి రైతులతో ప్రత్యేకంగా చర్చించారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్ పి.సత్యవాణి, ఏపీఎంఐపీ పీడీ పద్మలత, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏడీఏ నర్సోజిరావు, సహాయ సంచాలకులు శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి నాగమోహన్, ఉద్యాన అధికారి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబునాయుడుకి ధన్యవాదాలు




**కావలి, మార్చి 18 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కూటమి పార్టీ ప్రభుత్వానికి టిడిపి మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కలిగిరి మండలం పెద్దపాడు ముత్తపల్లి మసీద్ ఆల్ నూర్ షేక్ రఫి అహ్మద్ బుధవారం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మైనార్టీ వేల్ఫేర్ డిపార్టెమెంట్ వక్ఫ్‌బోర్డు ద్వారా 5వేల మసీదులకు ఒక్కో మసీదుకు రూ.90వేలు చొప్పున ఆరునెలల గౌరవ వేతనం రూ.45కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వానికి మైనార్టీ రాష్ట్ర శాఖ మంత్రి ఎస్‌ఎండి ఫారూక్‌కి, వక్స్ బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్‌కి పట్టణ, పరిసర ప్రాంత మసీదులోని ముతవలిలలు తరపున ప్రభుత్వానికి ధన్య వాదాలు తెలిపారు.

## ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్ విశేషాలు,

## జరిగిన లబ్ధి, ఒప్పందాల వివరాలు తెలియజేయండి



**నెల్లూరు, మార్చి 18, ప్రభాతవార్త :** లోక్ సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలు ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన వరల్డ్ ఏఐ సమ్మిట్‌లో భారతదేశంతో పాటు ఇతర దేశాల నుండి పాల్గొన్న వ్యక్తులు, స్టార్టప్‌లు, కంపెనీల వివరాలు, ఇతర కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు, అంతర్జాతీయ సంస్థల మధ్య జరిగిన ఒప్పందాల (ఎం.ఓ.యులు) వివరాలు తెలియ జేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ మేరకు లోక్ సభలో ఈ అంశంపై పలు ప్రశ్నలు వేశారు. జరిగిన ఒప్పందాల విలువ, ఉద్యోగ కల్పన, ఎఐ ప్రయోజనాల గురించి పౌరులకు అవగాహన కల్పించే చర్యలు తెలియజేయాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానం ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనికతకు అనుగుణంగా, ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిని, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య, పరిపాలన వంటి రంగాలలో సమస్యలను పరిష్కరించ దానికి ఏఐ (ఎఐ) ను ఉపయోగించడంపై దృష్టి సారించాలన్నారు. ఏఐ (ఎఐ) రంగంలో దేశం సామర్థ్యాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. ఏఐ నైపుణ్యాలు, సామర్థ్యాలలో స్టాన్‌ఫోర్డ్ ఏఐ ఇండెక్స్ దేశాన్ని ప్రపంచ అగ్రగాములలో ఒకటిగా పేర్కొందనీ, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఏఐ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు మన దేశం నిలయంగా మారిందన్నారు, గత సంవత్సరం దాదాపు 89 స్టార్టప్‌లు ఏఐ ఆధారితమైనవేనని చెప్పారు. ప్రపంచ ఏఐ ఎకోసిస్టమ్‌లో భారతదేశం యొక్క పెరుగుతున్న పాత్రను దృష్టిలో ఉంచుకుని, పారిస్ ఏఐ యాక్షన్ సమ్మిట్ 2025 కు సహఅధ్యక్షత వహించి, తదనంతరం 2026 ఫిబ్రవరి 1621 తేదీలలో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 నిర్వహించిందన్నారు. ఇప్పటివరకు జరిగిన ఎఐ సదస్సులలో ఇది అతిపెద్దది కాగా. గ్లోబల్ సౌత్‌లో నిర్వహి ంచబడిన మొట్టమొదటిదని చెప్పారు. ఈ సమావేశంలో 22 మంది దేశాధినేతలతో సహా 100కు పైగా దేశాలు , సుమారు 10 అంతర్జాతీయ సంస్థలు పాల్గొన్నాయని తెలిపారు. సుమారు 6 లక్షల మంది ప్రత్యక్ష ంగా హాజరుకాగా, లైవ్ వర్చువల్ స్ట్రీమింగ్ ద్వారా 9 లక్షలకు పైగా వీక్షణలు నమోదయ్యాయనీ పేర్కొ న్నారు. సదస్సు సందర్భంగా ఏడు నేపథ్య కార్యవర్గాలు చేపట్టిన కృషిని గుర్తిస్తూ, 92 దేశాలు , అంతర్జాతీయ సంస్థలు ఆమోదించిన ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ డిక్లరేషన్‌ను వెలువరించాయి. అధిక ప్రభావం చూపిన ఎఐ విస్తరణలను నమోదు చేస్తూ, ఆరు గ్లోబల్ కేస్‌బుక్‌లు విడుదలయ్యాయనీ, ఆరోగ్య రంగంలో ఎఐ (డబ్ల్యూ.హెచ్.ఓ తో), ఎనర్జీ లో ఎఐ (ఐ.ఈ.ఏ తో), లింగ సాధికారతలో ఎఐ (యూ.ఎన్ మహిళలతో), వ్యవసాయంలో ఎఐ (మహారాష్ట్ర ప్రభుత్వ సహకారంతో, ప్రపంచ బ్యాంకు మద్దతుతో), విద్యా రంగంలో ఎఐ (సి.ఎస్.ఎఫ్ , ఏక్‌స్టెప్ ఫౌండేషన్‌తో), యాక్సెసిబిలిటీలో ఎఐ (అలిమ్‌కో, ఐఐఐటి బెంగళూరు , చేంజ్‌ఇంక్ ఫౌండేషన్ సహకారం ఇస్తుందన్నారు. ఎఐ సదస్సులో మౌలిక సదుపాయాలు, ఫౌండేషన్ నమూనాలు, హార్డ్‌వేర్ , అప్లికేషన్‌ల రంగాలలో 250 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్లు అంచనా వేశారు. ప్రపంచ వెంచర్ క్యాపిటల్ సంస్థలు ఏఐ ఆవిష్కరణలకు మద్దతుగా బిలియన్ల డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించగా, ఒక ప్రముఖ టెక్నాలజీ కంపెనీ కనెక్టివిటీ, దేశంలోని ఏఐ హబ్, ఇంకా కోట్లాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులకు చేరే భారీ శిక్షణా కార్యక్రమాలలో గణనీయమైన పెట్టుబడులను ప్రకటించిందన్నారు. ఈ శిఖరాగ్ర సమావేశ ఫలితంగా దేశంలో ఎఐ ప్రతిభావంతుల సమూహాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో భారీస్థాయి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, సామర్థ్య పెంపు కార్యక్రమాలు ప్రకటించా మన్నారు. ఈ కార్యక్రమాలు లక్షలాది మంది విద్యార్థులకు, ప్రభుత్వ ఉద్యోగులకు చేరువవు తా యని, తద్వారా ఎఐ, డిజిటల్ నైపుణ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. దాంతోపాటు ఏఐ పరిశోధన, డేటా సైన్స్, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు , డిజిటల్ సేవలు వంటి రంగాలలో గణనీయమైన ఉపాధి అవకాశాలు దొరుకుతాయని చెప్పారు. ఇండియాఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో దేశం పాక్స్ సిలికా కూటమిలో చేరింది. ఈ కూటమిలో యునైటెడ్ స్టేట్స్ మరియు ఇతర భాగస్వామ్య దేశాలు ఉన్నాయని చెప్పారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా, భారతదేశం మరియు స్వీడన్ మధ్య వాణి జ్య, పెట్టుబడి సంబంధాలను ప్రోత్సహించడానికి ఇండియా ఏఐ మిషన్ మరియు బిజినెస్ స్వీడన్ ఒక ఉద్దేశ ప్రకటన (SOL)పై సంతకాలు చేశాయని, పౌరులు, పరిశ్రమ, విద్యావేత్తలలో అవగాహన, సామర్థ్య నిర్మాణం మరియు బాధ్యతాయుతమైన స్వీకరణను ప్రోత్సహించడానికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI )తో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై క్రమం తప్పకుండా కార్యక్రమాలు, ప్రచారాలు నిర్వహించడం యొక్క ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య మరియు పరిపాలన వంటి రంగాలలోAI యొక్క సామర్థం గురించి భాగస్వాములకు అవగాహన కల్పించడానికి, అలాగే బాధ్యతాయుతమైన మరియు సమ్మిళిత AI అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఈ సదస్సు ఒక ప్రధాన వేదికగా ఉపయోగపడిందని పేర్కొన్నారు.

## బుచ్చి ఆర్టిసిలో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ





**బుచ్చి మార్చి 19 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం ఆర్టిసి ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు దివ్యాంగ శక్తి పథకాన్ని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్ దివ్య కామాక్షి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. దివ్యాంగ శక్తి ప్రధకం దివ్యాంగుల పాలిట వరం అని ఆమె కొనియాడారు. సిటి,ఆర్డనరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో మహిళలకు స్త్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా వీటిలో దివ్యాంగులకు కూడా ఉచిత ప్రయాణం వర్తింప చేసిందని ఈ పథకాన్ని గుంటూరు బస్టాండ్‌లో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రారంభించారని ఆమె తెలిపారు. అనంతరం ఆర్టీసి డిపో మేనేజర్ దివ్య కామాక్షి మాట్లాడుతు ప్రస్తుతం దివ్యాంగులకు మెట్రో ఎక్స్‌ప్రెస్,పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, నాన్‌స్టాప్, అంతరాష్ట్ర ఇంతర్‌రాష్ట్ర ,ఇంటర్ స్టేట్ సప్తగిరి ఎక్స్‌ప్రెస్,తిరుమల ఘాట్‌రోడ్డులో తిరిగేవి, అల్ట్రా డిలక్స్, బస్సు సర్వీసులోని టికెట్ చార్జి లో 50 శాతం రాయితీని ఇస్తారని తెలిపారు.ఇకపై జీరో ఫెయిర్ టికెట్ జారీ చేస్తారేమో,విజయవాడ,విశాఖపట్టణం నగర్లాలోని సిటి ఆర్డనరీ బస్సలో ఉచిత ప్రయాణం సదుపాయం ఉందని, తాజా ఉత్తర్వులు నేపద్యంలో పల్లె వెలుగు అల్ట్రా పల్లెవెలుగు ,ఎక్స్‌ప్రెస్ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులో కూడా దివ్యాంగులకు ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తారని,రాష్ట్రంలో 11 లక్షల మంది దివ్యాంగులు ఉన్నట్లు సంబందిత శాఖ అధికారుల సమాచారం అని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ ఉపాధ్యాక్షులు ఎం.వి శేషయ్య, వైస్ చైర్‌పర్సన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి,జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, మోర్ల మురళీ, శేషయ్య, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్ ,కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ,వింజం రామానాయుడు, రమేష్‌రెడ్డి, మైనార్టీనాయకులు సుభానీ, హాస్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి,నాపా వెంకటేశ్వర్లు నాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీదేవి, ఇప్పగుంట సుధాకర్‌రెడ్డి,దుగ్గిశెట్టి హరినాద్,తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లకు ఘన సన్మానం



**సీతారామపురం మార్చి 19 ప్రభాతవార్త :** సర్పంచ్‌ల పదవి కాలం వచ్చేనెల ముగియ నుండడంతో వారి సేవలకు గుర్తింపుగా బుధ వారం ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి, మండల వైసిపి కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సన్మాన కార్యక్రమానికి హాజరైన సర్పంచ్‌లకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. వారితోపాటు తహసిల్దారు ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎంపిడిఒ ,ఎంఇఒలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపిపి దంపతులను సర్పంచ్‌లు గజమాలతో సత్కరిం చారు. వైస్ ఎంపిపి బసిరెడ్డి కృష్ణారెడ్డి,ఎంపిటిసి తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మలను సర్పంచ్‌లు సత్కరించారు .ఈకార్యక్రమంలో ఎంపిడిఒ వైశివ ప్రసాద్‌రావు, తహసిల్దారు షేక్.ఫజిహా,ఎంఇఒ మస్తాన్ వలి, వైస్ ఎంపిపి బసిరెడ్డి కృష్ణారెడ్డి,ఎంపిటిసి తమ్మిశెట్టి వెంకట సుబ్బమ్మ, సర్పంచ్‌లు చప్పిడి తిరపతి రెడ్డి, కొడవటి కంటి బాగ్యమ్మ, పల్లె విజయ మ్మ, చింతన బోయిన దుర్గయ్య,గాజులపల్లి భారతీ, పొట్టి శ్రీలక్ష్మీ, మద్దినేని ఆదినారాయణ,ముత్తుర వెంకటసు బ్బయ్య,పాముదు మారెమ్మ,దుర్గం సంపూర్ణ,ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎస్‌కె షాను, తదితరులు పాల్గోన్నారు.

## వేసవిలో త్రాగునీటి సమస్యలు లేకుండా చూడండి



**సీతారామపురం మార్చి 19 ప్రభాతవార్త :** వేసవి కాలం దృష్ట్యా మండలంలో త్రాగునీటి సమస్యల లేకు ండా అధికారులుముందస్తు చర్యలు చేపట్టి త్రాగునీటి సమస్యల లేకుండా చూడాలని ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి తెలిపారు. బుదవారం స్దానిక మండల పరి షత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశంలో అధికారులు తమ పరిధిలోని జరిగిన పనులను, చేయాల్సిన పనులను ప్రభుత్వ పథకాల పనితీరును వివరించారు. సీతారామపురం బిట్ 1 ఎంపిటిసి పిపి అల్లూరు రాజు,రెవిన్యూ అధికారుల అవినీతి పై తీవ్రంగా ధ్వజమెత్తారు.గత 50 సంవత్సరాల నుండి కూడా తమ పేరుపై ఉన్న భూమి సాగులో ఉన్న భూమిని రీసర్వే పేరుతో మరి కొందరి వద్ద డబ్బులు తీసుకొని మరొకరిపేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కిండం జరుగుతుందని ఇది ఏమిటని ప్రశ్నించిన రైతులను కార్యాలయం చుట్టు తిప్పుకుంటు రైతులను తీవ్రంగా ఇబ్బందులు కు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దశాబ్దా కాలం నుండి తమ పేరు పైన ఉన్న భూమిని రీ సర్వేలో నోషనల్ ఖాతాలో చేర్చడం వల్ల నోషనల్ ఖాతా నుండి తొలగించడానికి రైతులను తహసిల్దారు కార్యాలయం చుట్టు తిప్పుకుటుం తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం తగదని రైతు సమస్యలు వెంటనే పరిష్కరించి రైతులను ఆగుకోవాలని అన్నారు. అదే విధంగా ఎంపిడిఒ కార్యలయంలో రికార్డుల మాయమై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.మండల అభివృద్ధిలో భాగంగా అప్పులు తెచ్చి పనులు చేపడితే ఎంపిడిఒ కార్యలయంలో ఎంబుక్‌లు ,రికార్డులు కనిపించక పోవడం ఏమ టని బాధ్యతా రహితంగా ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది వ్యవహారిస్తున్నారని ఆయన ఆరోపిం చారు. తహసిల్దారు ఎంపిడిఒ కార్యాలయాల సిబ్బంది తమ పనితీరును మార్చకొని ప్రజలకోసం పనిచేయాలని హితవు పలికారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సమావేశానికి గౌరు హాజరు కావడంతో ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. ఉపాధీహామి సిబ్బంది పని ప్రదేశాలలో కూలీలకు నీడ,మంచినీరు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయ్యం చేసుకుంటు ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించాలని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె కోరారుఈకార్యక్రమంలో ఎంపిడిఒ వై శివప్రసాద్‌రావు,తహసిల్లారు షేక్.ఫజిహా, సొసైటీ అద్యక్షులు రాజశేఖర్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు అధికారులు పాల్గోన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ చేసిన నూర్‌బాషా దూదేకుల సంఘం



**కావలి, మార్చి 18 ప్రభాతవార్త :** కావలి నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దుశారం జన తా పేట ఆంధ్రకేసరి పాఠశాల పక్కన ఉన్న షేక్ నన్నెమ్మ గృహ ంలో 50మంది పేద నూర్‌బాషా దూదేకుల కుటు ంబాలకు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని రంజాన్ తోఫా బియ్యం, పలు రకాల సరుకులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆసంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది పేద ముస్లింలకు రంజాన్‌తోపా అందజేస్తామని ఈ ఏడాది కూడా రంజాన్ తోఫాను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు షేక్ ఖలీల్, ఆర్గనైజేషన్ సెక్రటరీ షేక్ చాంద్‌భృాష్యా, అహ్మద్‌బాషా, కాలేషా, మున్నినన్నెమ్మలు పాల్గొన్నారు.

## కావలి నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, మార్చి 18 ప్రభాతవార్త :** శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా కావలి నియోజకవర్గ ప్రజలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ షడ్‌రుచుల సమ్మేళనంతో ప్రారం భమయ్యే ఈ పర్వదినం ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖశాంతులు తీసుకురావాలని ఆయన ఆకాక్షించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలకు ఆ భగవంతుడు అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని దేవుడిదీవెనలతో అన్ని విషయాలు విజయం సిద్ధించాలని కోరారు. సిఎం, ఉప ముఖ్యమంత్రి, మం త్రుల సారధ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ప్రజల జీవితాలు కళకళలాడాలని ఆయన ఆకాక్షించారు.

## జనగణనపై సమీక్ష



**కోట, మార్చి 18 ప్రభాతవార్త :** మే 1 నుంచి 31వ తేదీ వరకు కోట మండ లంలో గృహ గణన కార్యక్రమాన్ని తొలి సారిగా నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కె. జయజయరావు చెప్పారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో తహశీ ల్దార్ జయజయరావు, ఎంపిడిఓ దిలీప్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 2027 ఫిబ్రవరి నుంచి ఇంటింటికి తిరిగి జనగణన సర్వే నిర్వహిస్తారని తెలిపారు. అందుకోసం మ్యాపింగ్ చేసే విధానంపై వివరించారు. ఇందులో 90 మంది ఎన్యుమరేటర్లు, 15 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటారని చెప్పారు.

## లిటిల్ ఏంజెల్స్‌లో గ్రాడ్యుయేషన్ డే



**చిల్లకూరు, మార్చి 18, ప్రభాతవార్త :** చిల్లకూరు శారదానగర్‌లో ఏర్పాటై ఉన్న లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో యూకేజీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన గూడూరు ఈఎస్ఐ వైద్యాధికారి డాక్టర్ కిషోర్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్, శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులను చూస్తుంటే తనకెంతో సంతోషంగా ఉందన్నారు. చిన్నతనం నుండే ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు నేటి ఆధునిక సమాజంలో ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచించేలా ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రభావితం చేయాలని సూచించారు. నేటి తరం విద్యార్థులు కొత్త కొత్త ఆలోచనలు, లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు కేవలం ర్యాంకుల కోసమే చదువుల్లో రాణించడం పక్కన పెట్టి సబ్జెక్టు పై ఎక్కువ శాతం అవగాహన కలిగి ఉండాలని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సుధేష్ణ, పీ.టీ.ఎం కార్యదర్శి దయాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నమశ్శివాయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గడప గడపకి సీపీఐ

**– ఈ నెల 24న పేదల ఇళ్ల స్థలాల కోసం జరిగే ధర్నాను జయప్రదం చేయండి**

**– సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి**



**గూడూరు, మార్చి 18, ప్రభాతవార్త :** పేదల పక్షాన నిరంతరం పోరాడుతూ సీపీఐ వందేళ్ల పూర్తి చేసుకు ందని, గడప గడపకి సీపీఐ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణం లోని సీపీఐ కార్యాలయంలో గూడూరు నియోజకవర్గ సమితి, ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన నిలిచేది సీపీఐ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతే సీపీఐ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు పేదలకు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న హామీ నీ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రంలో మెడికల్ మాఫియా నానాటికి పెట్రేగి పోతుందని, మెడికల్ మాఫియాని కట్టడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందన్నారు. సీపీఐ తరపున పోరాటం చేశామన్నారు.అదేవిధంగా మాదక ద్రవ్యాలు సేవించి పార్టీ చేసుకుంటున్న టీడీపీ ఎంపీ పుట్టా మహేష్‌ను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడం బాధాకరం అన్నారు. అమెరికా అనాలోచిత నిర్ణయాలు వలన ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంను ఎదురుకుంటున్నాయన్నారు. ఇకనైనా అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం ఆగి పోయి శాంతి వాతావరణం నెలకొల్పాలని పేర్కొన్నారు. పెరిగిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. ఈ నెల 24వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఇళ్ల స్థలాలు కోసం జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. అదే విధంగా గడప గడపకి సీపీఐను తీసుకువెళ్లి, ప్రజలతో మమేక మై నిధి వసూళ్ల చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన గూడూరు సిపిఐ నాయకులను అభినందించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పేరును యధావిధిగా కొనసాగించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గడప గడపకి సీపీఐ పోరాటాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, సీపీఐ నియోజకవర్గ సహాయక కార్యదర్శి జమాలుల్లా, సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్ , ఏఐవైఎఫ్ నాయకులు సివిఎల్, బికెఎంయూ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస మూర్తి, మీరా భాయ్, రాఘవులు, సుబ్రమణ్యం, వెంకటయ్య , గౌస్ బాషా, రాజా, సతీష్, సుందరం, నరసింహులు, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఉచిత బస్సు ను సద్వినియోగం చేసుకోవాలి

**– గూడూరు ఆర్డీవో సత్యనారాయణ**



**గూడూరు, మార్చి 18, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయా ణాన్ని నేటి నుంచి ప్రారంభించిందని దివ్యాంగులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని గూడూరు ఆర్డీవో సత్యనారాయణ వెల్లడించారు. గూడూరు పట్ట ణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో దివ్యాంగుల ఉచిత బస్సు ప్రయాణ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఆర్డీవో సత్య నారాయణ పాల్గొన్నారు. ఆర్డీవో, టిడిపి నాయకులకు ఆర్టీసీ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బస్సును ఆర్డీవో నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని 40 శాతంకు పైగా పర్సంటేజ్ ఉన్న వారందరూ అర్హులని దివ్యాంగులు ఎక్కడికైనా వెళ్లాలంటే ఖర్చుకు భయపడకుండా ఉచిత బస్సు ప్రయాణంలో వెళ్లవచ్చని తెలిపారు. ఆర్టీసీ డిఎం చెంచులక్ష్మి, నాయకులు రహీం, వెంకటేశ్వరరాజు, పెంచలయ్య, మట్టం శ్రావణి రెడ్డి, గుండాల లీలావతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ఫలితాల్లో 'శ్రీ సుబ్రహ్మణ్యం' ప్రభంజనం



**వింజమూరు, మార్చి 18, ప్రభాతవార్త :** అకుంఠిత దీక్ష, సరైన శిక్షణ తోడైతే సామాన్య విద్యార్థులు కూడా అసాధారణ ఫలితాలు సాధించగలరని వింజమూరులోని శ్రీ సుబ్రహ్మణ్య నవోదయ సైనిక్ అకాడమీ మరోసారి నిరూపించింది. తాజాగా విడుదలైన 2026 నవోదయ, సైనిక్ స్కూల్ ఫలితాల్లో ఈ సంస్థకు చెందిన 6 మంది విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపరిచి సీట్లు సాధించారు. సంస్థ ప్రారంభించిన కేవలం రెండు సంవత్సరాల స్వల్ప కాలంలోనే మొత్తం 12 మంది విద్యార్థులను జాతీయ స్థాయి పాఠశాలలకు పంపడం విశేషం. నెల్లూరు జిల్లాలోనే నవోదయ శిక్షణలో అగ్రగామిగా నిలుస్తూ, గ్రామీణ ప్రాంత విద్యార్థుల పాలిట ఈ అకాడమీ ఒక వరంగా మారింది. కార్పొరేట్ విద్యా సంస్థల్లో అపార అనుభవం గడించిన నిపుణులైన అధ్యాపక బృందంతో శిక్షణ ఇవ్వడమే ఈ విజయ రహస్యమని స్థానికులు కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా రాజీవ్ నగర్‌లోని అకాడమీ ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. సంస్థ డైరక్టర్ బి.సురేంద్ర రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డైరక్టర్ సురేంద్ర రాజు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. రాబోయే రోజుల్లో మరిన్ని అత్యుత్తమ ఫలితాలు సాధిస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం లాంగ్ టర్మ్ బ్యాచ్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చెంచయ్య, హరిత, నరేంద్ర, అశోక్, రమ్య, వర్షిణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజేతలకు అభినందనలు తెలియజేశారు.

## ముఖ్యమంత్రి పర్యటన నేపధ్యంలో ముమ్మర ఏర్పాట్లు





**వింజమూరు, మార్చి 18, ప్రభాతవార్త :** స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 28వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉదయగిరి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి రూట్ మ్యాప్, వేదికల ఎంపిక కోసం జిల్లా పరిషత్ సీఈఓ ఎల్.శ్రీదర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిణి వసుమతి, జేడీహెచ్ కే.రమేష్‌నాయక్, ఇతర ఉన్నత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అందులో భాగంగా మండల కేంద్రంలో జరుగుతున్న పాతూరు చెరువు సుందరీకరణ పనులను అధికారులు సందర్శించారు. పనుల పురోగతిని సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలను ప్రతిబింబించేలా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం కొండాపురం మండలంలోని కామధేను ప్రాజెక్టును అధికారులు సందర్శించారు. ప్రాజెక్టు సామర్థ్యం, అక్కడ ముఖ్యమంత్రి పర్యటనకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. అనంతరం వింజమూరులో విలేకర్లతో మాట్లాడిన అధికారులు, జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఖరారైన నేపధ్యంలో తాము ఈ రెండు కీలక ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ రెండు ప్రదేశాలకు సంబంధించిన సాధ్యాసాధ్యాలు, భద్రత, వసతులపై సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. కలెక్టర్ తుది నిర్ణయం తీసుకున్న తర్వాత సీఎం పర్యటించే ఖచ్చితమైన ప్రాంతం ఖరారవుతుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, ఇతర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**– ఎస్ఈఐఎల్ కంపెనీచే దివ్యాంగులకు 98 ట్రై సైకిల్ అందించనున్నాం**

**– ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



**ముత్తుకూరు, మార్చి 18, ప్రభాతవార్త :** దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, త్వరలో ఎస్ఈఐఎల్ కంపెనీచే దివ్యాంగులకు 98 ట్రై సైకిల్‌ను కూడా అందించబోతున్నామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముత్తుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించి, దివ్యాంగులతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో దివ్యాంగ శక్తి పథకం" ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో కేవలం అంధత్వం, చెవిటి, మూగ, మానసిక వికలాంగులకు మాత్రమే సిటీ బస్సులో ఉచిత ప్రయాణానికి అవకాశం ఉండేదని, నేడు 21 రకాల కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు పల్లె వెలుగు, అల్ట్రా డీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రీమియం ఏసీ బస్సుల్లో 50 శాతం రాయితీ, ఎస్కార్ట్‌కు 50 శాతం రాయితీ అందించనున్నట్లు చెప్పారు. 74 శాతం బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించేలా దివ్యాంగ శక్తి పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం శుభపరిణామమని వివరించారు. దీని వల్ల వారి రోజువారీ జీవనం సులభతరం అవుతుందని తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగం, విద్య, వైద్యం వంటి అవసరాల కోసం ప్రయాణించే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆర్టీసీ ద్వారా ఈ సేవలను సమర్థవంతంగా అమలు చేయడం అభినందనీయం అని అన్నారు. డిజిటల్ బస్ పాస్, క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక సాంకేతిక సౌకర్యాలు ప్రవేశపెట్టడం వల్ల పారదర్శకత పెరగడంతో పాటు సేవలు వేగవంతంగా అందుతాయని వివరించారు. ప్రతి దివ్యాంగుడు ఈ పథకం ప్రయోజనాలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఇప్పటికే ప్రభుత్వం వికలాంగులకు 6వేలు నుంచి 15వేల రూపాయల వరకు పింఛన్లు మంజూరు చేస్తూ వారి జీవనానికి ఆర్థిక భరోసా కల్పించినట్లు చెప్పారు. డ్రైవర్లు, కండక్టర్లు కూడా వికలాంగులను గౌరవిస్తూ కుటుంబ సభ్యుల వలె చూసుకోవాలని సూచించారు. బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పూర్తిగా సహకరించాలని, జాగ్రత్తగా చూసుకోవాలని పిలుపునిచ్చారు. దివ్యాంగులకు సామాజిక భద్రత, గౌరవప్రద జీవనానికి తోడ్పడే ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులు కూడా సమాజంలో సమాన హక్కులు కలిగిన పౌరులని, వారికి స్వయం ఆధారిత జీవన విధానం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. దివ్యంగా శక్తి పథకాన్ని దివ్యాంగులందరూ సంపూర్ణంగా సద్వినియోగం చేసుకొని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. గొప్ప పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దివ్యాంగ శక్తి పథకం దివ్యాంగులకు ఒక వరం లాంటిదని, ప్రభుత్వం ఎల్లప్పుడూ వారికి తోడుగా ఉంటుందని భరోసా ఈ పథకం ద్వారా మరొకసారి నిరూపించబడినట్లు ఆయన చెప్పారు. వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఇప్పటికే వారికి 6000 నుంచి 15 వేల వరకు పింఛన్లు కూడా అందిస్తున్నట్లు వివరించారు. ఈ మంచి పథకాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎస్ఈఐఎల్ కంపెనీ సహకారంతో 98 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్ల అందించబోతున్నామన్నారు. 15 రోజుల్లో వాటిని దివ్యాంగులకు అందిస్తామన్నారు. వెంకటాచలంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఆర్సీ ఆధ్వర్యంలోనూ 90 ట్రైసైకిళ్ల తయారవుతున్నాయని, ఒక్కొకటి రూ.40 వేలకు పైగా విలువైన నాణ్యమైన ట్రైసైకిళ్ల అందించబోతున్నామన్నారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీ విషయంలోనూ ఆలస్యం చేయొద్దని అధికారులకు సూచించామన్నారు. సమాజంలో మన తోటి బిడ్డలైన దివ్యాంగులకు సహకరించే విషయంలో మేము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీల మల్లికార్జున యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, మునుకూరు రవి కుమార్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నన్నం దీనయ్య, సర్వేపల్లి ఐ టీడీపీ నాయకులు తిరుమలశెట్టి సతీష్ నాయుడు, పట్టణ అధ్యక్షులు బొలిగార్ల శ్రీనివాసులు, అక్కయ్య గారు ఏడుకొండలు, పగడాల సతీష్, దండు శ్రీనివాసులు ఆలిముత్తు, దొరువుల పాలెం టిడిపి నాయకులు గోపాల్ రెడ్డి, జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్ నాయుడు, బిజెపి నాయకులు కాకుటూరు రవీందర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో కారుణ్య నియామకాలు



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 18, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్డు రవాణా సంస్థలో వివిధ హోదాలలో పనిచేసి మరణించిన వారి కుటుంబ సభ్యులకు భుదవారం జిల్లా కలెక్టర్ శ్రీ. హిమాన్షు శుక్లా కలెక్టర్ కార్యలయములోని వారి ఛాంబరులో కారుణ్య నియామక పత్రాలు అందచేసారు. 1.ఎ.పి. యస్.ఆర్.టి.సిలో కండక్టరుగా విధులు నిర్వహిస్తూ మరణించిన బి. శ్రీనివాసరావు వారి కుమారుడు, బి.అభినవ్ ను వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా సాంఘీక సంక్షేమ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అందచేసారు. 2. ఎ.పి. యస్.ఆర్.టి.సిలో ఎలాక్రిషియాన్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన యస్.డి.ఖాదర్ బాషా, వారి కుమార్తె యస్.డి. రేష్మిను వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా సాంఘీక సంక్షేమ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అందచేసార3. ఎ.పి.యస్.ఆర్.టి.సిలో పర్యవేక్షకునిగా విధులు నిర్వహిస్తూ మరణించిన పెంచలయ్య, వారి కుమారుడు ఐ. కృష్ణకు వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా సాంఘీక సంక్షేమ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అందచేసారు. 4. ఎ.పి.యస్.ఆర్.టి.సిలో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన జి.పెంచలయ్య, వారి కుమారుడు జి.నవీన్‌కు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా సాంఘీక సంక్షేమ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అందచేసారు. 5. ఎ.పి.యస్.ఆర్.టి.సిలో డైవర్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన యస్.కె. మొహ్యమ్మద్ రసూల్, వారి కుమారుడు యస్.కే. మహమ్మద్ రఫికు వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా సాంఘీక సంక్షేమ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అందచేసారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విదుల పట్ల అంకిత భావంతో పనిచేయడంతో పాటు పై అధికారుల ఆదేశాలను విధిగా అమలు చేస్తూ ఆయా శాఖలకు మంచి పేరు తెచ్చేలా పనిచేయాలని తెలియ చేస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## స్కీం బాధితుల ఆందోళన



**కోట, మార్చి 18 ప్రభాతవార్త :** కోట మండలం చిట్టేడులోని అనిల్ ఇంటి వద్ద బుధవారం స్కీం బాధితులు ఆందోళన చేపట్టారు. అనిల్ వద్ద కొంత మంది బాధితులు 500 రూపాయలు వంతున కట్టారని వాపోయారు. గత సంవత్సరం అనిల్ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో తమకు రావాల్సిన సొమ్మును తిరిగి ఇవ్వాలని బాధితులు అతని ఇంటి వద్ద బైఠాయించారు. పోలీసులకు సమాచారం అందడంతో ఆందోళనకారులతో మాట్లాడి పోలీసుస్టేషన్‌కు వస్తే మాట్లాడతామని చెప్పారు. బాధితులంతా పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను కోరారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల జాబ్ అచవర్స్‌డే



**కావలి, మార్చి 18 ప్రభాతవార్త :** రుద్రకోట, కావటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్‌డే కళాశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ రవాణా అధికారి పి.మురళీధర్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఆర్.సుందరరావులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ప్రత్యే అతిధిగా శ్రీనివాస స్పన్‌పైప్స్ కంపెని ప్రొపైటరీ ఎ.రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుశీల్‌కుమార్ ప్రియ అధ్యక్షతన వహించి ఈ విద్యాసంవత్సరానికి సంబందించి వారిషక నివేదికను సమర్పించారు. అనంతరం అతిధులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్లను అందజేశారు. రామ్మోహన్‌రావు ఎలక్ట్రిసిటి, సివిల్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు చొప్పున నలుగురికి నగదు బహుమతి అందజేశారు. డిప్లమా 2వ, 3వ ఏడాది చదువుతున్న మొదటి, రెండవ టాపర్ విద్యార్థులకు అకాడమిక్ ఎక్సలెన్స్ విభాగంలో మెరిట్ సర్టిఫికెట్లు మెడల్స్ ప్రధానం చేశారు. సివిల్ ఎలక్ట్రికల్ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని అలరించాయి.

## 16 రకాల శ్రీలక్ష్మి డాలర్లతో పూజ



**కోవూరు, మార్చి 18 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న గ్రామ దేవత నాగవరపమ్మ దేవస్థానంలో పరాభవనామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా గురువారం అమ్మ వారికి 16 రకాల శ్రీ లక్ష్మి డాలర్లతో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బ రామయ్య తెలిపారు. వీటితో పాటు 16 రకాల శ్రీ లక్ష్మి ప్రతివ లతో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందని, ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని అమ్మవారి తీర్థప్ర సాదాలు ఆశీస్సులు పొందాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.





































## విద్యార్థులు భాద్యతాయుతంగా మెలిగేలా అవగాహన కల్పించండి

**- కమిషనర్ వై.నందన్**



**నెల్లూరు కార్పోరేషన్, మార్చి 18 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక పరిధిలో వివిధ కేంద్రాలలో ఇంటర్, పదవ తరగతి పరీక్షలు వ్రాసిన విద్యార్థిని, విద్యార్థులు తిరుగు ప్రయాణంలో కళాశాలలు, పాఠశాలలకు చెందిన వాహనాలలో వెళ్ళే సందర్భాల్లో అ్యంత నిర్లక్ష్య దోరణి ప్రదర్శిస్తూ పేపర్లను చించి రోడ్లపై విసిరి వేయడం మానుకోవాలని కమిషనర్ వై.నందన్ హితులు పలికారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల, పాఠశాల నిర్వాహకులు వాహనాల నిర్వాహకులను ఉద్దేశించి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నగరవ్యాప్తంగా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పారిశుద్య నిర్వహన పనులను నగరపాలక సిబ్బంది క్రమం తప్పకుండా చేపడుతున్నామని స్వచ్ఛ సర్వే క్షణ్ కార్యక్రమంలో భాగంగా సుందరీకరణ పనులను చేపట్టే నగరాన్ని అదర్శంగా తీర్చిదిద్దుతున్నామని కమిషనర్ తెలిపారు. రోడ్లను అపరిశుభ్రం చేసే ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్స హించబోమని నగర పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని కమిషనర్ సూచించారు. ఇలాంటి చర్యలను విద్యార్థులు చేయకుండా తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించి నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.




## నేడు గ్రీన్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా

**కోట, మార్చి18 ప్రభాతవార్త** నేడు కోట పట్టణంలో రంజాన్ పండగను పురస్కారించుకుని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ముస్లీం సొదరులకు గ్రీన్ పౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను పంపిణీ చేయనున్నారు. గత 20 ఏళ్లుగా కోటలో గ్రీన్ పౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లీం సొదరులకు రంజాన్ కానుక కింది ఈతోపాను 600 మందికి పంపిణి చేయడం జరుగుతుంది. ఈ క్రమంలో ఈ కార్యక్రమంకు గూడూరు శాసన సభ్యులు డాక్టర్, పాశిం సునిల్‌కుమార్ హజరుకానున్నారు. గ్రీన్ పౌండేషన్ చైర్మెన్ షెక్.జలీల్‌అహ్మద్ ఆమేరకు బుధవారం అన్ని ఏర్పాట్లును పరిశీలించారు. ఎస్‌కేబి ప్రాంగణంలో ఓ పండగలా జరగనుంది. ఈ కార్యక్రమంకు కొరకు ఏంతో మంది ముస్లీంలు ఎదురు చూస్తున్నారు.

## గండికోటకు ఉగాది సత్కారం



**బుచ్చి మార్చి 18 ప్రభాతవార్త** తెలుగు బాషాభివృద్ధి, ఉగాది విశిష్టత రచనలపై నిరంతరం కృషి చేయడమే కాకుండా పిల్లలకు పద్యపోటీలు నిర్వహిస్తు రచయిత్రులు, కవుల జయంతులను నిర్వహిస్తు మూడు దశాబ్దాలుగా తెలుగులోనే కేవలం చేవ్రాలు చేస్తు తెలుగుబాషా సంస్కృతుల మీద ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి పురాతన శాసనాల గురించి అవగాహన కల్పిస్తున్న రామచంద్రాపురం ప్రాధమికోన్నత పాఠశాలఉపాధ్యాయులు సాహితి వేత్త గండికోట సుధీర్ కుమార్ ఉగాది పురస్కారం అందుకున్నారు. వెంకటాచలం ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆయనకు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. అనంతరం గండికోట ఉగాది కవి సమ్మేళనంలో కవితా గానం చేసి అందరిని ఆకట్టుకున్నారు. ఉగాది సత్కారం అందుకున్న గండికోటను ఉపాధ్యాయులు, సాహితీ వేత్తలు, మిత్రులు అభినందించారు.

## బాల్య వివాహాలపై మరింత అవగాహన అవసరం




**కోవూరు, మార్చి 18 ప్రభాతవార్త :** కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బాల్య వివాహాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో టి.శారద అన్నారు. కోవూరులోని ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం కొడవలూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ భవనాలు ఉన్న చోట తప్పనిసరిగా కిచెన్‌గార్డెను ఏర్పాటు చేసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు తగు చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి చిన్నారికి ఆటపాటలతో కూడిన విద్యను తప్పక అందించాలన్నారు. ప్రతి బాలిక పెళ్లీడు వచ్చిన తర్వాతనే వివాహం చేసుకునేలా వారిలో అవగాహన పెంచాలన్నారు. ముఖ్యంగా గర్భవతులు, బాలింతలు ఐరన్ లోపం లేకుండా బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని తీసుకునేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పలు విషయాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, తదితరులు ఉన్నారు.

## అధికారులు ఇబ్బంది పడతారు : కాకాణి



**మనుబోలు మార్చి 18 ప్రభాతవార్త** టిడిపి నాయకులు ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కుట్ర జరుగుతుందని అందుకు అధికారులు సహకరిస్తే ఇబ్బంది పడతారని జాగ్రత్తగా ఉండాలని మాజీ మంత్రి వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మనుబోలు మండలం కాగితాలపూర్ క్రాస్‌రోడ్డులోని సర్వే నెంబర్ 434 లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. పాత జిపిఏతో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రిజిష్టేషన్ చేయాలని సోమిరెడ్డి చూస్తున్నాడని ఇలా జరిగితే ఉరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి బాస్కర్‌గౌడ్, ముంగర రవీంద్రరెడ్డి, కమలాకర్‌రెడ్డి, గుంజి రమేష్, ఆవుల తులసీరామ్ యాదవ్, ఆవుల జగదీష్ యాదవ్, చిట్టమూరు రామచంద్రారెడ్డి, కొమ్మలపూడి సర్పంచ్ బందెల వేణు, దువ్వూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్‌లో ముందస్తు ఉగాది వేడుకలు



**నెల్లూరు, మార్చి 18, ప్రభాతవార్త –వైద్యం** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది ప్రతి ఒక్కరికి ఆనందాన్ని ఆరోగ్యాన్ని పంచాలని, ఈ ఏడాది అంతా ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్ర ప్రసాద్ ఆకాంక్షించారు. బుధవారం నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్పాస్టిక్ సెంటరోలన ముందస్తు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహించారు. స్పాస్టిక్ సెంటర్‌ను మామిడి తోరణాలు బంతి పూలతో అందంగా అలంకరించారు. చిన్నారులు సాంప్రదాయ వస్త్రాలు ధించి పండుగ యొక్క వైభవాన్ని చాటి చెప్పారు. వారి వస్త్ర ధారణ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా దాసరి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ పర్వదినం సందర్భంగా తయారు చేసే ఉగాది పచ్చడిలో ఉన్న షడ్రుచులు ఒక్కొక్క పదార్థం ఒక్కో విధంగా మనలోని సంతోషాలను బాధలను క్రోధాన్ని తెలుపుతాయని వివరించారు. అందరూ ఈ ఏడాది సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఇందులోని తీపి, చేదు, పులుపు, వగరు, కారం, ఉప్పు, మనిషి జీవితాన్ని సూచిస్తుందన్నారు. అనంతరం ప్లాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ ఉదయభాస్కర్ మాట్లాడుతూ చిన్నారులు వారి తల్లిదండ్రులకు సిబ్బందికి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.




## రైతులకు గిట్టుబాటు ధర కల్పిచండంలో కూటమి ప్రభుత్వ విఫలం

### వైసిపి జిల్లా అద్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి



**మనుబోలు మార్చి 18 ప్రభాతవార్త** రైతులకు గిట్టుబాటు ధరకల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి వైసిపి జిల్లా అద్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మనుబోలులో ఆయన బుధ వారం విలేఖర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్ప న్నటికి అలాగే ధాన్యపు కొనుగోలు కేంద్రాలను తెరిచినప్పటికి ఫలితం లేకుండా పోయిందన్నారు. సోమిరెడ్డి మిల్లర్లతో మిలాఖత్ అయి దోచుకుంటున్నారన్నారు. రైతులకు అండగా నిలవవలసిన కూటమి నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. సోమిరెడ్డి కూడా రైతులకు అండగా నిలవడం లేదని అన్నారు. వైసిపి పార్టీ తరపున తాము రైతుల పక్షాన నిలుస్తామని వారి తరపున పోరాటం చేస్తామన్నారు. అనంతరం ఆయన ఇటీవల మృతి చెందిన చిట్టమూరు సుదర్శనమ్మ కుటుంబ సభ్యు లను అలాగే జనార్ధన్‌నాయుడు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి బాస్కర్‌గౌడ్, ముంగర రవీంద్రరెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, కుడుముల వెంకటరమణాగౌడ్, ఏలూరు బాస్కర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, ఆవుల తులసీరామ్, యాదవ్, గుంజి రమేష్, గిద్దండి రమణయ్య, తుపాకుల గిరి, కనిమల మల్లికార్జున, చల్ల నవకోటి శివరాం తదితరులు పాల్గొన్నారు.

## సిద్దవరం వాసీకి కఠిన సేవా పోలీస్ పతకం



**రాపూరు, మార్చి 18, ప్రభాతవార్త** మండలంలోని సిద్దవరం గ్రామానికి చెందిన రిజర్వ్ సబ్ ఇనస్పెక్టర్ పాలెపు రాజశేఖర్‌కు ఉగాధి పర్వదినం రోజు పోలీస్ శాఖ అందించే ప్రతిష్టాత్మక కఠిన సేవా పథకం అవార్డుకు ఎంపికైనారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఇతను ఎనిమిది సంవత్సరాల పదవీ కాలంలో మావోయిస్టులను ఎదుర్కోనే గ్రేహౌండ్స్ విభాగం, ఉగ్రవాద నిరోధక విభాగం, ఆక్టోపస్ వంటి అనేక కీలకమైన వీబాగాలలో విధులు నిర్వహించి ఉత్తమ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఈయన ఉగ్రవాధ కార్యకలాపాల నిరోధక విభాగంలో పనిచేస్తున్నారు. మండలానికి చెందిన పోలీస్ అధికారికి పోలీస్ శాఖలో ఉత్తమ అవార్డు రావడం పట్ల పలువురు ఆయనకు అభినందనలు తెలియచేశారు.